
# ఆలోచించండి



## కలిసివుంటే కలదు సుఖం

ఒకప్పుడు మనది పురుషాధిక్య సమాజం. స్త్రీల మీద శారీరక, మానసిక హింస జరిగేది. భర్తతో మనస్పర్థలు వచ్చిన స్త్రీని పుట్టింటివారు ఆదరించే వారు కాదు. తల్లిదండ్రులతోపాటు ఇరుగుపొరుగు వారు కూడా చిన్నచూపు చూసే వారు. అందువల్ల భర్తకొట్టినా, తిట్టినా సహించి అతని దగ్గరే బ్రతుకు వెళ్ళదీసేవారు. కానీ ప్రస్తుత సమాజంలో చాలా మార్పులు వచ్చాయి. తల్లిదండ్రులు ఆడపిల్లల్ని కూడా పెద్దచదువులు చదివిస్తున్నారు. వారు పెరిగి పెద్దయి ఉన్నతోద్యోగాలలో రాణిస్తున్నారు. భర్తతో మనస్పర్థలు వచ్చినప్పుడు తల్లిదండ్రులు స్త్రీలకు అండగా నిలుస్తున్నారు. భర్తల ధోరణిలో కూడా మార్పులు వచ్చాయి. ఇప్పటి భర్తలు ఇంటి పని, వంట పనిలో భార్యకు సహకరించటం నామోషీగా భావించటం లేదు. పిల్లల పెంపకంలో కూడా సహాయం చేయటానికి వెనుకాడటం లేదు. కానీ సమాజంలో మగవాళ్ళు దుర్మార్గులు, స్త్రీలను హింసించేవారు అన్న ముద్ర మాత్రం పోవటం లేదు. ఇటీవల పత్రికలలో వస్తున్న వార్తలు ఇందుకు తార్కాణం.

ఇటీవల గుంటూరు జిల్లాలో ఒక సంఘటన జరిగింది. ఇరవై రెండేళ్ళ అబ్బాయి, పందొమ్మిదేళ్ళ అమ్మాయి మీద అత్యాచారం చేశాడని, గ్రామస్తులు అతడిని బంధించి, విచక్షణా రహితంగా కొట్టి చంపేశారట. తీరా పోలీసులు ఎంక్వైరీ చేస్తే అతను అత్యాచారం చేయలేదనీ, ఆ అమ్మాయికి ఇష్టంలేని పెళ్ళి నిర్ణయిస్తే స్నేహితుడికి కబురు చేసిందనీ, ఆమెను కాపాడటానికి వచ్చి జనం చేతిలో చిక్కుకుపోయాడనీ తేలింది. ఈ వార్త పత్రికలో చదవగానే మనసు కలచివేసింది. ఇరవై రెండేళ్ళు అంటే ఎంత చిన్నవయసు? జీవితంలో నాలుగవ వంతు కూడా జరగలేదు. ఒకవేళ ఆ అబ్బాయి తప్పుచేస్తే పోలీసులకి తెలియజేయాలి గానీ శిక్షించే హక్కు గ్రామస్తులకేం ఉంది? దీనికంతటికీ కారణం సమాజంలో మగవాళ్ళపట్ల ఉన్న దురభిప్రాయం.

ఓ టీవీ ఛానెల్లో భార్యాభర్తల మధ్య వచ్చే మనస్పర్థలు సరిదిద్దే కార్యక్రమం ప్రసారం అవుతోంది. ఓ సినీ నటి ఆ కార్యక్రమానికి యాంకర్‌గా వ్యవహరిస్తోంది. యధాలాపంగా ఛానెల్స్ మారుస్తూ అసంకల్పితంగా అక్కడ ఆగిపోయాను. "ఆమెకు మాత్రం ఇష్టాయిష్టాలు వుండవా? కాదనటానికి నువ్వెవరివయ్యా?" అని సినీ నటి, ఆ భర్తమీద అరుస్తోంది. "భార్యాభర్తలు ఒకరి అభిప్రాయాలు ఒకరు గౌరవించుకోండి" అని చెపితే బాగుంటుంది గానీ, నువ్వెవరివయ్యా అనటమేమిటి? అంటే భర్త ఇష్టాయిష్టాలతో భార్యకు ప్రమేయం లేదా? అనిపించింది నాకు. మళ్ళీ ఆ యాంకరే "నీ భార్యను బాగా చూసుకుంటానని మాట ఇవ్వు" అని నిర్బంధిస్తోంది. అంత సర్వస్వతంత్రులం అనుకున్నప్పుడు ఇంకొకరు దగ్గరుండి బాగా చూసుకోవలసిన పనేమిటి? భార్యాభర్తల వివాదంలో ఆడవాళ్ళపైనే సానుభూతి ఉండటం దీనికి కారణం.

సినిమాలలో కూడా ఆడపిల్లలని 'బంగారుతల్లి' అని సంబోధిస్తూ మగపిల్లాడిని, 'అంబోతు, దున్నపోతు, మగవెధవ' అని తిట్టిపోస్తుంటారు. ఒకరిని ప్రశంసించాలంటే, మరొకరిని దూషించాలా? అబ్బాయి అయినా, అమ్మాయి అయినా మన బిడ్డలు కాదా?!

భగవంతుడి సృష్టిలో స్త్రీ,పురుషులిద్దరూ సమానం. స్త్రీ, పురుషుల పరస్పరానురాగం మీదే కుటుంబ వ్యవస్థ ఆధారపడి ఉంటుంది. ఇద్దరూ కలిసి జీవిస్తేనే సంపూర్ణజీవితం అవుతుంది. ఒకవేళ ఒంటరిగా జీవించగలిగినా అది అసంపూర్ణజీవితమే అవుతుంది. అలా జీవించటంలో సంతోషం ఉండదు. ఒకరినొకరు గౌరవించుకుంటూ మనుగడ సాగించాలి. ఈ విషయాలు తల్లిదండ్రులు అబ్బాయిలకైనా, అమ్మాయిలకైనా విడమరచి చెప్పాలి. వయసులో ఉన్న ఆడ, మగ మాట్లాడుకుంటేనే అపరాధంలా చూడకూడదు. భార్యాబాధితుల సంఘాలు ఇటీవల వెలియటం ఆందోళన కలిగించే విషయం. ఈ సంఘాల సంఖ్య ముందు ముందు ఇంకా పెరగకుండా చూడటం మన కర్తవ్యం. ఆలోచించండి.

-గోనుగుంట మురళీకృష్ణ (రేపల్లె)

---

## ట్రీట్‌మెంట్?

ఒకప్పుడు హోమియోపతిని అభిరుచిగా చేసుకుని రోగిని ట్రీట్ చేసేవాళ్ళు. సౌమ్యంగా మాట్లాడుతూ రోగి శారీరక స్థితిని, అలవాట్లను కూలంకషంగా తెలుసుకుని, తమ అనుభవంతో మాత్రలిచ్చేవారు. 'ఫీజు ఎంతివ్వాలి' అని అడిగితే కొంతమంది పైసా ఆశించకుండా చిరునవ్వు నవ్వేవారు. మరికొంతమంది ఎదురుగావున్న డబ్బాలో తోచింది వేయమనేవారు. ఆ డబ్బు, డబ్బులిచ్చుకోలేని బీద వాళ్ల వైద్యానికి ఉపయోగించేవారు. రోగి తన వ్యాధి తగ్గిపోయిందని చెప్పినప్పుడు వాళ్ల ఆనందం అంతా ఇంతా కాదు. నిజానికి వాళ్ళు కోరుకునేదదే.

ఇప్పుడు హోమియోపతి వైద్యవిధానంలో కూడా కార్పొరేట్ కల్చర్ చోటుచేసుకుంది. నా ఫ్రెండ్ ఒకతను తనకో సమస్య వుంటే హోమియోపతి అయితే మళ్ళీ వ్యాధి కనిపించకుండా తుదముట్టిస్తుందని, ఒక పెద్ద కార్పొరేట్ హాస్పిటల్‌కు వెళుతూ నన్ను తోడు తీసుకెళ్ళాడు. అక్కడ మా ఫ్రెండ్‌ని అన్ని వివరాలు అడిగి తెలుసుకుని, ఆ వ్యాధికి సంవత్సరం ట్రీట్‌మెంట్ అవసరమవుతుందనీ, దానికి రూ.15000/- లు అవుతుందనీ, అదీ ఒక్కసారిగా చెల్లించాలని చెప్పాడు. పైగా ఆ వ్యాధికి అల్లోపతి ట్రీట్‌మెంట్ తీసుకుంటే, ఆపరేషన్‌తోపాటు మందులకీ వాటికీ చాలా ఎక్కువ ఖర్చవుతుందని, అయినా మళ్ళీ వచ్చే అవకాశం ఉంటుం


దని, అదే హోమియోపతి ట్రీట్‌మెంట్ తీసుకుంటే ఆ వ్యాధిని పీడకలగా మర్చిపోవచ్చని, మందులు విదేశాలనుంచి తెప్పిస్తారు కాబట్టి అంత ఖర్చని నవ్వుతూ వివరించాడు ఒక ప్రత్యేక క్యూబికల్‌లో కూర్చున్న కస్టమర్ కేర్ మనిషి. నా ఫ్రెండ్ రెండు, మూడు ఇన్‌స్టాల్‌మెంట్లలో కనబడతానని ఎంత రిక్వెస్ట్ చేసినా వినలేదు. చివరకు ఆ వ్యాధి బాధపడలేక క్రెడిట్‌కార్డ్‌తో పే చేశాడు.

ట్రీట్‌మెంట్ ప్రారంభించిన నాటి నుండి ఎనిమిది నెల్లైనా ఏ మాత్రం మార్పులేదు. "ఎప్పుడు తగ్గుతుంది" అని అడిగితే, "క్రానిక్ డిసీజ్ కదా, టైం పడుతుంది" అని చెప్పేవారు. వ్యాధివల్ల వాడు పడే బాధ, వేదనకు నాకు చాలా జాలేసేది. ఒకసారి అది మరింత తీవ్రమై ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. హోమియోపతి ట్రీట్‌మెంట్‌కి పెట్టిన డబ్బంతా వృథా అయింది. పైనుంచి ఆపరేషన్‌కు, మందులకు తడిసిమోపెడయింది.

అన్నిచోట్ల ఇలాగే జరుగుతుందని చెప్పట్లేదు. కానీ కష్టపడి సంపాదించి, పైస పైస ఆలోచించి ఖర్చుచేసే మనిషిని, రోగం లొంగదీసుకుంటుంది. అసహాయ స్థితిలో వైద్యనారాయణుడి దగ్గరకు వెళతాడు. దాన్ని ఎరకు చిక్కిన చేపలా భావిస్తే ఎలా? ఒకేసారి డబ్బు కట్టమనడం ఎంతవరకు న్యాయం? వ్యాధి తగ్గుముఖం పడుతుంటే ఆనందంగా అడిగిన డబ్బు ఇస్తాడు కదా!

కొసమెరుపు: సంవత్సరం ట్రీట్‌మెంట్ పూర్తయిన తర్వాత మళ్లీ ఇంకో ఆర్నెళ్లో, సంవత్సరమో ట్రీట్‌మెంట్ అవసరమని ఫీజ్ తీసుకుంటారు. ఇది మరో రోగి ద్వారా తెలిసింది. అందుచేత డబ్బు చెల్లించేముందు, అన్ని వివరాలు బాగా తెలుసుకుని నమ్మకం పూర్తిగా కుదిరితేనే ముందుకెళ్లండి.

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు
(సికిందరాబాద్)




ప్రతివాళ్ళకీ ఎన్నో ఆలోచనలు మదిలో మెదులుతూనే ఉంటాయి. వాటిలో మీ వ్యక్తిగత జీవితానికి సంబంధించినవి భద్రంగా దాచుకోండి. సమాజం గురించీ, దేశం గురించీ, అందరికీ సమస్యలుగా తయారయ్యే విషయాల గురించీ మీకొచ్చే ఆలోచనలని ఆంధ్రభూమి వారపత్రికలో మీ సహపాఠకులతో పంచుకోండి. వీలైతే మీకు తోచిన పరిష్కారాలు చెప్పండి. మంచి సూచనలు చేయండి. మీ మనసులో మాటల్ని రెండు అరతావు పేజీల్లో అక్షరాలుగా కూర్చి కాగితం మీద పెట్టండి. మీ పాస్ పోర్టు సైజు ఫోటో జత చేయండి. మీ ఆలోచనలు ఎందరికో కనువిప్పు కలిగించవచ్చు. కొందరికి ఓదార్పు నివ్వచ్చు. సమాజానికి మేలు కొలుపూ కావొచ్చు.

**మీ ఆలోచనలు పంపాల్సిన చిరునామా:**

## ఆలోచించండి

ఎడిటర్,
ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక,
36, సరోజినీదేవి రోడ్,
సికింద్రాబాద్-500003.

**ఇది మీకోసం! ఇందులో మీరే రాయాలి మరి!**